సాక్షి
వైఎస్సార్ జిల్లా

శుక్రవారం । 24 । మే । 2024



ముత్యపు పందిరిపై నారాపురస్వామి

బ్రహ్మోత్సవాలలో భాగంగా భూదేవి, శ్రీదేవి సమేత నారాపుర స్వామికి ఉదయం, సాయంత్రం గ్రామోత్సవం నిర్వహించారు. -8లో



పచ్చిరొట్టతో.. పైరుకు బలం

పచ్చి రొట్ట.. భూసారం పెంపులో దిట్ట. భూముల్లో రేగడి మట్టి పోసేకంటే.. పచ్చిరొట్ట ఎరువు సాయంతో సారవంతంగా మార్చుకోవచ్చు. -8లో

గరిష్టం/కనిష్టం
38.4/27.8

వాతావరణం

జిల్లాలో గురువారం 27.8 – 38.4 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 5.2 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

కౌన్సెలింగ్ వాయిదా

కడప రూరల్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలల్లో ప్రవేశాలకు ఈ నెల 25న నిర్వహించాల్సిన స్పాట్ అడ్మిషన్ కౌన్సెలింగ్‌ను వాయిదా వేసినట్లు జిల్లా కో–ఆర్డినేటర్ మాధవిలత తెలిపారు. తదుపరి కౌన్సెలింగ్ తేదీని ప్రకటిస్తామని పేర్కొన్నారు.

హౌసింగ్ ఎంఐసీ సస్పెన్షన్

మైదుకూరు: నియోజకవర్గంలోని దువ్వూరు మండల హౌసింగ్ ఇన్‌చార్జి (ఎంఐసీ) శాంతి, వర్క్ ఇన్‌స్పెక్టర్ దస్తగిరిలను ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారని హౌసింగ్ డీఈఈ పాండురంగారెడ్డి పేర్కొన్నారు. మండలంలోని పక్కా ఇళ్ల లబ్ధిదారులకు స్టీల్ పంపిణీ విషయంలో అవకతవకలకు పాల్పడినట్లు అధికారులకు ఫిర్యాదులు వెళ్లాయని పేర్కొన్నారు. దానిపై విచారణ చేసి ఎంఐసీ శాంతి, వర్క్ ఇన్‌స్పెక్టర్ దస్తగిరిలపై చర్యలు తీసుకున్నట్లు డీఈఈ వివరించారు.

తిరునాలలో మెరిసిన కిరణ్ అబ్బవరం



చాందినీ బండిని నడుపుతున్న సినీ నటుడు కిరణ్ అబ్బవరం

సంబేపల్లె: మండల పరిధిలోని శెట్టిపల్లె పంచాయతీలో కొలువైన శ్రీ వీరాంజనేయ స్వామి తిరునాల గురువారంతో ముగిసింది. స్వామి వారికి ప్రత్యేక పూజలు అభిషేకాలు ,అర్చనలు గావించారు. ఈ క్రమంలో సినీ నటుడు అబ్బవరం కిరణ్ స్వామి వారికి చాందినీ బండిని కట్టి మొక్కు తీర్చుకున్నారు. అంతేకాకుండా వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడంతో తిరునాల కొత్త శోభను సంతరించుకుంది.

రాయలసీమ అంటే అన్నమయ్య



తాళ్లపాకలో భక్తులను ఉద్దేశించి ప్రసంగిస్తున్న స్వరూపానందేంద్ర సరసర్వతి

రాజంపేట: రాయలసీమ అంటే అన్నమయ్య ..అన్నమయ్య అంటే రాయలసీమ అని విశాఖ శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి అన్నారు. గురువారం తాళ్లపాకలో భక్తులనుద్దేశించి ఆయన మాట్లాడుతూ రాయలసీమలో ఎంతో మంది కవులు, జ్ఞానులు, యోగులు, సిద్ధులు జన్మించారన్నారు. తన మహిమాన్విత గానంతో శ్రీ వెంకటేశ్వరస్వామి హృదయంలో స్థానం పొందిన అన్నమయ్యకు ఎవరూ సాటిరారన్నారు. పరమపవిత్రమైన ప్రాంతం అన్నమయ్య జన్మస్థలి తాళ్లపాక అన్నారు. అన్నమాచార్య ప్రాజెక్టు ద్వారా టీటీడీ అన్నమాచార్య కీర్తనలకు యావత్ భారతదేశంలోనే ప్రాచుర్యం కల్పించిందన్నారు. ప్రతి ఇంటా అన్నమయ్య కీర్తనలు ఉంటే స్వామి వారిని ప్రత్యక్షంగా చూసిన అనుభూతి కలుగుతుందని చెప్పారు. అన్నమాచార్య ప్రాజెక్టు డైరెక్టర్ విభీషణశర్మ మాట్లాడుతూ స్వరూపానందేంద్ర సరసర్వతి తాళ్లపాకను దర్శించడం మహాభాగ్యమన్నారు. కార్యక్రమంలో టీటీడీ డిప్యూటీ ఈఓ ప్రశాంతి, అన్నమయ్య వారసులు హరినారాయణాచార్యులు, అన్నమాచార్య ప్రాజెక్టు సూపరింటెండెంట్ కుమార్ పాల్గొన్నారు.

క్షయను తరిమేద్దాం!


మనిషి ఆరోగ్యంపై కర్కశత్వంగా దాడి చేసే 'క్షయ' కట్టడికి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఒకరి నుంచి మరొకరికి సంక్రమించే ఈ వ్యాధి నివారణకు పెద్ద ఎత్తున కార్యక్రమాలు చేపడుతోంది. పుట్టిన తరువాత పిల్లలకు ఎడమ వైపు భుజానికి 'ముద్ర' టీకాను వేస్తారు. ప్రస్తుతం పెద్దలకు సంబంధించి 'అడల్ట్ బీసీజీ' టీకా అందుబాటులోకి వచ్చింది.

- క్షయ నివారణకు 'అడల్ట్ బీసీజీ టీకా
- ప్రస్తుతానికి 20,068 మందికి పైగా వ్యాక్సిన్
- రాష్ట్రంలోనే జిల్లా ప్రథమ స్థానం
- సచివాలయాల్లో ఉచితంగా లభ్యం



వేంపల్లెలో బీసీజీ వ్యాక్సిన్ వేస్తున్న డీఎంహెచ్ఓ డాక్టర్ నాగరాజు

కడప రూరల్: టీబీ.. ఒకప్పుడు ఈ పేరు వింటేనే హడల్.. ఇప్పుడా పరిస్థితి లేదు. పెద్దలకూ వ్యాక్సిన్ అందుబాటులోకి వచ్చింది. ఒక్కసారి చరిత్రలోకి వెళితే టీబీ మహమ్మారి వల్ల దేశాలకు దేశాలే కుదేలయ్యాయి. ఏ వయసు వారికైనా సంక్రమించే అవకాశం ఉంది. 1882వ సంవత్సరంలో జర్మనీ దేశానికి చెందిన వైద్య శాస్త్రజ్ఞుడు డాక్టర్ రాబర్ట్ కాక్ క్షయ వ్యాధికి కారణమైన సూక్ష్మక్రిములను కనుగొన్నారు. వాటికి 'మైకో బాక్టీరియం ట్యూబర్ క్యులోసిస్' అని పేరు పెట్టారు. ఇదొక భయంకరమైన అంటు వ్యాధి. కాగా ఈ జబ్బు నియంత్రణకు ప్రభుత్వం ఎన్నో అవగాహన కార్యక్రమాలను చేపట్టింది. ప్రభుత్వ ఆసుపత్రుల ద్వారా ఉచితంగా నిర్ధారణ పరీక్షలతో పాటు వైద్య సేవలు అందిస్తోంది. దీంతో చాలా వరకు 'క్షయ' నియంత్రణలోకి వచ్చింది.



'ముద్ర' నుంచి 'అడల్ట్ బీసీజీ' వరకు...

ప్రభుత్వం టీబీ వ్యాధి నివారణకు ఎన్నో కార్యక్రమాలను చేపడుతోంది. అందులో భాగంగా పుట్టిన పిల్లలకు ఎడమ వైపు చేతి భుజానికి 'ముద్ర' టీకాను వేస్తారు. తాజాగా ప్రభుత్వం పెద్ద వయసు వారికి సంబంధించి 'అడల్ట్ బీసీజీ' వ్యాక్సిన్‌ను అందుబాటులోకి తెచ్చింది. ఈ టీకాను కుడివైపు చేతి భుజానికి వేస్తారు. కాగా ఈ వ్యాక్సినేషన్ కార్యక్రమం జిల్లాలో ఈ నెల 16వ తేదీ నుంచి ప్రారంభమైంది. ఇప్పటి వరకు జిల్లాలో మొత్తం 20,068 మందికి వైద్య సిబ్బంది టీకాలు వేశారు. దీంతో వ్యాక్సినేషన్‌లో రాష్ట్రంలోనే జిల్లా ప్రథమ స్థానంలో ఉంది. మొత్తం 3.50 లక్షల మందికి పైగా వ్యాక్సిన్ వేయడానికి వైద్య ఆరోగ్య శాఖ చర్యలు చేపట్టింది. ఈ టీకాను అర్హులైన వారికి అన్ని సచివాలయాల్లో ప్రతి గురువారం ఏఎన్ఎం/ఎంఎల్‌హెచ్‌పీలు ఉచితంగా వేస్తారు.

వ్యాక్సిన్ పొందడానికి అర్హులు...



- 60 ఏళ్లు పైబడిన వారు.
- గడిచిన ఐదేళ్లలో టీబీ వచ్చి తగ్గిపోయినవారు.
- టీబీ వ్యాధిగ్రస్తులకు సన్నిహితంగా ఉన్నవారు.
- 18 ఏళ్లు నిండిన వారిలో...
- పొగత్రాగే వారు..షుగర్ వ్యాధి ఉన్న వాళ్లు
- బీఎంఐ 18 (అత్యంత బలహీనంగా ఉన్న వారు) కన్నా తక్కువగా ఉన్నవారు.

వ్యాక్సిన్ పొందడానికి అనర్హులు....

- ప్రస్తుతం టీబీ వ్యాధితో మందులు వాడే వారు.
- గర్భిణులు...పాలిచ్చే తల్లులు.
- హెచ్‌ఐవీ/ఎయిడ్స్ బాధితులు
- వ్యాక్సిన్ వేయించుకొనే సమయంలో జ్వరం, జలుబు, దగ్గు ఉన్నవారు.
- వ్యాక్సిన్ వేసినప్పుడు రియాక్షన్ వచ్చే వాళ్లు
- కిడ్నీ, లివర్, ట్రాన్స్‌ప్లాంట్ చేసుకొని మందులు వాడే వారు.
- రక్తదానం చేసిన మూడు నెలల వరకు..18 ఏళ్లు దాటని వారు టీకా వేసుకోకూడదు.

క్షయ నివారణకు చర్యలు



క్షయ నివారణకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అర్హులైన ప్రతి ఒక్కరూ అడల్ట్ బీసీజీ వ్యాక్సిన్ వేయించుకోవాలి. ప్రతి గురువారం సచివాలయంలో ఈ టీకాను వైద్య సిబ్బంది ఉచితంగా వేస్తారు. టీబీ నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి.

– డాక్టర్ నాగరాజు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి

ముగిసిన తెప్పోత్సవాలు

కడప కల్చరల్ : పగలంతా స్వామికి ఉపచారాలు చేసి అలిసిపోయిన అమ్మవారలు సేద తీరేందుకు మళ్లీ ఆయన చెంతకే చేరారు. స్వామి వారిద్దరినీ ఆనందింపజేసేందుకు తన కోవెల పుష్కరిణికి చేరారు. ధగధగలాడే అలంకారంతో ఉన్న తెప్పపై అల్లనల్లన విహరిస్తూ చల్లని నీటిలో ఆనంద పరవశులై సాగారు. దేవునికడప శ్రీ లక్ష్మి వెంకటేశ్వరస్వామి ఆలయ తెప్పోత్సవాలలో భాగంగా మూడవరోజు గురువారం ముగింపు సందర్భంగా స్వామి, అమ్మవార్లు తెప్పపై విహరించారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ ఈశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో తెప్పపై కొలువుదీర్చి మూడుమార్లు వేద పండితుల మంత్రోచ్చాటనలు, రెండుసార్లు మంగళ వాయిద్యాల సుస్వరాలు, మరో రెండుసార్లు అన్నమాచార్య కీర్తనల మధ్య తెప్పోత్సవం నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.



విశేష అలంకారంలో స్వామి, అమ్మవార్లు



తెప్పోత్సవంలో స్వామి, అమ్మవార్లు



వైభవంగా ఒంటిమిట్ట రామయ్య పౌర్ణమి కళ్యాణం దృశ్యం

వైభవంగా పౌర్ణమి కల్యాణం

ఆంధ్రా భద్రాద్రిగా విరాజిల్లుతున్న ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి దేవాలయంలో బుధవారం పౌర్ణమి సందర్భంగా సీతారాముల కల్యాణం టీటీడీ వారు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవ మూర్తులకు పంచామృతాభిషేకాలు నిర్వహించి పట్టు వస్త్రాలు తొడిగి తులసీ గజ మాలలతో సుందరంగా అలంకరించి భక్తజనం సమక్షంలో వైభవంగా స్వామివారి కల్యాణం జరిగింది.

–ఒంటిమిట్ట

అడ్మిషన్.. అటెన్షన్

- ముందస్తు అడ్మిషన్లతో జాగ్రత్త
- ఆకట్టుకునే ప్రచారాలు నమ్మి మోసపోవద్దు
- పాఠశాలల గురించి తెలుసుకున్నాకే పిల్లలను చేర్పించాలి
- రిజిస్ట్రేషన్, గుర్తింపుపై ఆరా తీయండి
- క్వాలిఫైడ్ టీచర్లు ఉన్నారా.. పరిశీలించాలి



మదనపల్లె సిటీ: విద్యా సంవత్సరం మరికొన్ని రోజుల్లో ప్రారంభం కానుంది. జిల్లాలో పుట్టగొడుగుల్లా ప్రైవేటు విద్యా సంస్థలు పుట్టుకొస్తున్నాయి. ప్రస్తుతం కొనసాగుతున్న ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల తోక పేర్లతో నూతన బ్రాంచిల పేరిట ఆయా ప్రాంతాల్లో ప్రారంభించేందుకు సిద్ధమయ్యారు. ఇందుకు హంగులూ, ఆర్భాటాలతో తల్లిదండ్రులను ఆకర్షించేందుకు ప్రచారాలు చేస్తూ ప్రవేశాల ప్రక్రియను చేపడుతున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం కొత్త ప్రైవేటు పాఠశాల ప్రారంభించాలంటే విద్యాశాఖ అనుమతి తీసుకోవాలి. మొదటి ఓపెనింగ్ అనుమతి తీసుకున్న తర్వాతే విద్యా సంస్థలను తెరచి విద్యార్థులను చేర్చుకోవాలి. తర్వాత పూర్తిస్థాయి అనుమతి పొందాలి. ప్రాథమిక స్థాయికి జిల్లా విద్యాశాఖ అధికారి నుంచి, ఉన్నత తరగతులు ప్రారంభించాలంటే విద్యాశాఖ రీజినల్ డైరెక్టర్ (ఆర్జేడీ) ద్వారా పాఠశాల విద్యా కమిషనర్ అనుమతి తీసుకోవాలి. సీబీఎస్ఈ సిలబస్ బోధించేందుకు కేంద్ర విద్యామండలి సమ్మతించాలి.

అవగాహన ఉంటేనే..: గత విద్యా సంవత్సరం మదనపల్లెలో ఓ కార్పొరేట్ పాఠశాల తమకు సీబీఎస్ఈ అనుమతి ఉందంటూ ప్రచారాలు చేసుకుని ప్రవేశాలు కల్పించింది. ఈ విషయంపై అవగాహన లేక కొందరు తమ పిల్లలను చేర్పించారు. పుస్తకాలు తీసుకున్నారు. వేలల్లో ఫీజులు చెల్లించినా విద్యార్థులకు స్టేట్ సిలబస్ బోధనలు చేస్తున్నారంటూ తల్లిదండ్రులు ఆందోళనలు చేశారు.

వీటిపై ఆరా తీయండి

ప్రతి విద్యా సంస్థ ప్రభుత్వం నుంచి కచ్చితంగా గుర్తింపు పొంది ఉండాలి. ఇది నిబంధన. గుర్తింపు పొందిన విద్యా సంస్థలలోనే తల్లిదండ్రులు పిల్లలను చేర్పించాలి. ఎలాంటి అనుమతులు తీసుకోకుండా కొన్ని పాఠశాలలు ఇతర విద్యా సంస్థల తరపున పరీక్షలు రాయిస్తుంటారు. అలా పరీక్ష రాసిన విద్యార్థులను ప్రభుత్వం ప్రైవేటు విద్యార్థిగానే పరిగణిస్తుంది. ఇలాంటి విషయాల్లో జాగ్రత్త అవసరం.

తీసుకోవాల్సిన జాగ్రత్తలివి..

- తొలుత పాఠశాలకు ప్రభుత్వ గుర్తింపు ఉందా లేదా అనేది చూసుకోవాలి.
- ప్రభుత్వ ఇంజినీరింగ్ విభాగం జారీ చేసిన పాఠశాల భవనం నాణ్యత ధ్రువీకరణ పత్రాన్ని పరిశీలించాలి.
- మౌలిక వసతులు చూసుకోవాలి. బాత్‌రూములు, మరుగుదొడ్లు, నీటి సదుపాయాలు తప్పనిసరి. విద్యార్థులు మానసిక, శారీరకోల్లాసానికి ఉపకరించే క్రీడా ప్రాంగణం, అనుగుణంగా క్రీడా ఉపాధ్యాయులు ఉన్నారా లేదా ఆరా తీయాలి.
- అర్హత గల ఉపాధ్యాయులు బోధనలు చేస్తున్నారా లేదా పరిశీలించాలి.
- ప్రాథమిక, ప్రాథమికోన్నత స్థాయిలో 20 నుంచి 40 మందికి ఒక ఉపాధ్యాయుడు ఉండాలి. ఉన్నత పాఠశాల అయితే సబ్జెక్టుల వారీగా ఒకరు చొప్పున ఉపాధ్యాయుడు ఉండాలి.
- సురక్షిత రవాణా సదుపాయానికి బస్సులకు రవాణాశాఖ సామర్థ్య పరీక్ష పత్రాన్ని జారీ చేస్తుంది. సుశిక్షితుడైన డ్రైవరు తప్పనిసరి.
- జీ–1 భవనాలు ఉంటే అగ్నిమాపక పరికరాలు, ఆ స్థాయి దాటితే మంటలు ఆర్పే పూర్తిస్థాయి వ్యవస్థ ఉండాలి. సంబంధిత విభాగం నుంచి అనుమతి ఉండాలి.
- ప్రభుత్వం అనుమతి లేని పాఠశాలల్లో విద్యార్థుల ను చేర్పితే భవిష్యత్తులో ఇబ్బందులు తలెత్తుతాయి. చైల్డ్ ఇన్‌ఫో ఆధారంగానే విద్యార్థుల ప్రగతి పత్రాలు, బదిలీ ధ్రువపత్రా లు జారీ చేయాల్సి ఉంటుంది. ప్రభుత్వ అనుమతి లేని వాటిలో ఈ నమోదు ఉండదు. ఆయా విద్యార్థులను బడిబయట ఉన్నవారీగా పేర్కొంటున్నారు.

కౌంటింగ్‌కు సర్వం సిద్ధం

జిల్లా ఎన్నికల అధికారి విజయరామరాజు



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా ఎన్నికల అధికారి విజయరామరాజు

కడప సెవెన్‌రోడ్స్: సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపునకు సంబంధించి కౌంటింగ్ కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు ఇప్పటికే సిద్ధం చేశామని జిల్లా ఎన్నికల అధికారి విజయరామరాజు తెలిపారు. కౌంటింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లు, భద్రతా చర్యలపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. చెదురుముదురు సంఘటనలు మినహా రాష్ట్రంలో ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించామని, అదే స్ఫూర్తితో ఓట్ల లెక్కింపు కార్యక్రమానికి ప్రణాళిక బద్ధంగా ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. ఈసీ మార్గదర్శకాల మేరకు త్వరితగతిన ఖచ్చితమైన ఫలితాలు వెలువడాలని చెప్పారు. దీనిపై జిల్లా ఎన్నికల అధికారి మాట్లాడుతూ కౌంటింగ్ ప్రక్రియ నిర్వహణకు ఎన్నికల సంఘం నిబంధనల మేరకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. కడప రిమ్స్ సమీపంలోని మౌలానా అబుల్ కలాం ఆజాద్ ఉర్దూ నేషనల్ యూనివర్సిటీలో కౌంటింగ్ కేంద్రం ఏర్పాటు చేశామని, 112 సీసీ కెమెరాల నిఘాలో కౌంటింగ్ జరుగుతుందన్నారు. పార్లమెంటు, ప్రతి అసెంబ్లీకి 14 చొప్పున ఈవీఎం టేబుళ్లు, పోస్టల్ బ్యాలెట్లకు కూడా 14 టేబుళ్లు ఏర్పాటు చేశామన్నారు. నిబంధనల మేరకు మీడియా కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. కౌంటింగ్ కేంద్రాలు, స్ట్రాంగ్ రూముల వద్ద ప్రత్యేక భద్రతా బలగాలను నియమించామన్నారు. కౌంటింగ్ హాల్స్, స్ట్రాంగ్ రూముల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. కౌంటింగ్ కోసం ఏఆర్‌ఓలు, సూపర్‌వైజర్లు, అసిస్టెంట్లు, మైక్రో అబ్జర్వర్లను నియమించామన్నారు. వీరికి ఈనెల 25న మొదటి విడత ర్యాండమైజేషన్ నిర్వహించి శిక్షణ ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ కమిషనర్ ప్రవీణ్‌చంద్, డీఆర్వో గంగాధర్‌గౌడ్, ఏఎస్పీ సుధాకర్ పాల్గొన్నారు.

నేటి నుంచి సప్లిమెంటరీ పరీక్షలు

- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- టెన్త్ పరీక్షలకు హాజరుకానున్న 3528 మంది
- ఇంటర్ పరీక్షలకు 17688 మంది
- పరీక్షా కేంద్రాల్లో పకడ్బందీగా ఏర్పాట్లు



కడప గాంధీనగర్ హైస్కూల్లో పరిశీలిస్తున్న డీఈఓ మర్రెడ్డి అనురాధ

కడప ఎడ్యుకేషన్: జిల్లావ్యాప్తంగా నేటి నుంచి ప్రారంభంకానున్న టెన్త్, ఇంటర్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలకు విద్యాశాఖ అధికారులు సర్వం సిద్ధం చేశారు. పరీక్షలకు హాజరుకానున్న విద్యార్థులకు పరీక్షా కేంద్రాలలో ఎటువంటి ఇబ్బందులు ఎదురుకాకుండా అన్ని వసతులను కల్పించారు. ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలను నిర్వహించే పరీక్షా కేంద్రాలలో ప్రతి తరగతి గదిలో సీసీ కెమెరాల పర్యవేక్షణలో పరీక్షలను నిర్వహించనున్నారు. టెన్త్ సప్లిమెంటరీ పరీక్షల హాల్ టికెట్లు డీఈఓ, ఏపీ.జీవీవో.ఇన్ వెబ్‌సైట్‌తోపాటు ఇంటర్ హాల్ టికెట్లును బీఐఈ.ఏపీ.జీవీవీ.ఇన్ సైట్లలో అందుబాటులో ఉంచారు. వాటిని విద్యార్థులు డౌన్‌లోడ్ చేసుకుని నేరుగా పరీక్షలకు హాజరుకావచ్చు.

ఈ నెల 24వ తేదీ నుంచి 31వ తేదీ వరకు నిర్వహించనున్న ఈ సప్లిమెంటరీ పరీక్షలకు జిల్లావ్యాప్తంగా 37 పరీక్షా కేంద్రాలను సిద్ధం చేశారు. జిల్లావ్యాప్తంగా ప్రథమ, ద్వితీయ సంవత్సరానికి సంబంధించి ఇంప్రూమెంట్, అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలను 17,688 మంది విద్యార్థులు రాయనున్నారు. ఇందులో ప్రథమ సంవత్సరానికి సంబంధించి 5336 మంది విద్యార్థులు ఇంప్రూమెంట్, 6011 మంది విద్యార్థులు నాన్ ఇంప్రూమెంట్‌కు

ఇంటర్‌కు పరీక్షా కేంద్రాలు

పరీక్షలను రాస్తున్నారు. అలాగే ఒకేషన్ ఇంప్రూమెంట్‌కు సంబంధించి 113 మంది, నాన్ ఒకేషన్ ఇంప్రూమెంట్ సంబంధించి 583 మంది విద్యార్థులు పరీక్షలను రాస్తున్నారు. అలాగే ద్వితీయ సంవత్సరానికి సంబంధించి 5114 మంది జనరల్, 531 ఒకేషనల్ పరీక్షలను రాయనున్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ప్రథమ సంవత్సర విద్యార్థులకు, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు ద్వితీయ సంవత్సర విద్యార్థులకు పరీక్షలు నిర్వహించనున్నారు. పరీక్షల నిర్వహణకు 37 మంది చీఫ్ సూపరింటెండెంట్లతో పాటు మరో 37 మంది అడ్మిషనల్ చీఫ్ సూపరింటెండెంట్లతో 550 మంది ఇన్విజిలేటర్లను నియమించారు. అలాగే పరీక్షల పర్యవేక్షణకు డీవీఈవో, ఆర్ఐవో, హైపవర్ కమిటి, సిట్టింగ్, ఫ్లయింగ్ స్క్వాడ్ ఏర్పాటు చేశారు.

టెన్త్ పరీక్షలు 16 పరీక్షా కేంద్రాలలో...

ఈ నెల 24వ తేదీ నుంచి జూన్ 3వ తేదీ వరకు పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు జరగనున్నాయి. ఈ పరీక్షల కోసం వైఎస్సార్‌జిల్లాలో 16 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ ఏడాది మార్చి 18వ తేదీ నుంచి జరిగిన పది పరీక్షలను 27,729 మంది రాయగా ఇందులో 25,538 మంది ఉత్తీర్ణతను సాధించారు. మిగతా 2191 మంది వివిధ సబ్జెక్టుల్లో ఫెయిలయ్యారు. ఈ ఏడాది ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులతోపాటు గతంలో ఫెయిలైన ప్రవేటు విద్యార్థులతో కలిసి మొత్తం 3528 మంది విద్యార్థులు వివిధ సబ్జెక్టుల పరీక్షలను రాయనున్నారు. సంబంధిత పరీక్షలు ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు జరగనున్నాయి. పరీక్షల విధులకు 16 మంది చొప్పున చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్టుమెంట్ అధికారులతోపాటు 120కిపైగా ఇన్విజిలేటర్లను నియమించారు. వీరితోపాటు పరీక్షల పర్యవేక్షణలకు రెండు స్క్వాడ్ బృందాలను ఏర్పాటు చేశారు.

పకడ్బందీగా నిర్వహిస్తాం



పది సప్లిమెంటరీ పరీక్షలను కూడా రెగ్యులర్ పరీక్షల మాదిరిగానే పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకున్నాం. దీంతోపాటు అన్ని పరీక్షా కేంద్రాల్లో అన్ని సౌకర్యాలను ఏర్పాటు చేశాం. విద్యార్థులకు అవసరమైన ఫర్నీచర్, తాగునీరు, ఫ్యా న్లు తదితర సదుపాయాలు ఉండే విధంగా చర్యలు తీసుకున్నాం.

– మర్రెడ్డి అనురాధ, జిల్లా విద్యాశాఖ అధికారి

అన్ని ఏర్పాట్లు పూర్తి



విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టాం. పరీక్షా కేంద్రాలలో విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా అన్ని మౌలిక వసతులను కల్పించాం. ఎండల నేపథ్యంలో విద్యార్థులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా తగిన చర్యలు తీసుకుంటున్నాం. పరీక్షల్లో ఎలాంటి ఆరోపణలకు తావులేకుండా పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లను సిద్ధం చేశాం.

–బి.వెంకటసుబ్బయ్య, ఆర్ఐవో, ఇంటర్ విద్య

ఇంటర్ తరగతుల నిర్వహణకు అనుమతి లేదు

– ఆర్ఐవో బండి వెంకటసుబ్బయ్య

కడప ఎడ్యుకేషన్ : వైఎస్సార్ జిల్లా పొద్దుటూరు పట్టణంలోని ఇంటర్మీడియట్ తరగతులు నిర్వహించేందుకు ఫేస్ సంస్థకు ఎలాంటి అనుమతి ఇవ్వలేదని ఆర్ఐవో బండి వెంకటసుబ్బయ్య ఓ ప్రకటనలో తెలిపారు. విద్యార్థుల తల్లితండ్రులు తమ పిల్లలను ఆ గుర్తింపులేని కళాశాలలో చేర్పించవద్దని, ఎవరైనా చేర్పిస్తే ఇంటర్మీడియట్ విద్యా మండలి బాధ్యత వహించదని తెలిపారు. నోటిఫికేషన్ కంటే ముందే ప్రవేశాలు తీసుకున్నట్లు, వేసవి సెలవుల్లో తరగతులు నిర్వహించడంతోపాటు అధిక ఫీజులు వసూలు చేస్తున్నట్లు ఫిర్యాదులందితే గుర్తింపును రద్దు చేస్తామని హెచ్చరించారు.

ముత్యపు పందిరిపై నారాపురస్వామి



జమ్మలమడుగు : నారాపురస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఈ నెల 20న ప్రారంభమైన ఈ బ్రహ్మోత్సవాలలో భాగంగా భూదేవి, శ్రీదేవి సమేత నారాపుర స్వామికి నిత్యం ఉదయం, సాయంత్రం గ్రామోత్సవం నిర్వహిస్తున్నారు. గురువారం ఉదయం ముత్యపు పందిరి వాహనంపై స్వామి, అమ్మవారిని భక్తులు కోలాటం, నృత్యం మధ్య పురవీధులలో ఊరేగించారు. సాయంత్రం సింహ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు.

వ్యవసాయ సిబ్బందికి వేతనాలు చెల్లించాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : రసాయనాలు లేని ప్రకృతి వ్యవసాయ విధానంపై రైతులకు అవగాహన కల్పించే సిబ్బందికి పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని సీపీఐ నాయకులు కేసీ.బాదుల్లా అన్నారు. నగరంలోని సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి నెలనెలా వేతనాలు ఇవ్వకపోవడంతో కుటుంబం గడవడం కష్టతరంగా ఉందన్నారు. అప్పులు చేసి కుటుంబాలను పోషించాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. గిట్టుబాటు ధర లేక పంట నష్టపోతున్నారన్నారు.

ఆకట్టుకున్న ఖవ్వాలీ



ఖవ్వాలీలో పాల్గొన్న భక్తులు

జమ్మలమడుగు : హజరత్ సయ్యద్ షా బడే గౌస్ పీరా ఖాద్రి ఉరుసు సందర్భంగా ఏర్పాటు చేసిన ఖవ్వాలీ ప్రేక్షకులను కట్టిపడేసింది. బుధవారం రాత్రి నుంచి గురువారం తెల్లవారుజాము వరకు నౌషద్ అలీఖాన్ టీం పీఠాధిపతి సయ్యద్‌షా గౌస్‌పీరా ఖాద్రిపై పాడిన పాటలకు భక్తులు కాసుల వర్షం కురిపించారు. గురువారం రాత్రి జునైద్ సుల్తాన్ టీంతో గొప్ప ఖవ్వాలీ పోటీ జరిగింది. పీఠాధిపతి గౌస్‌పీరాఖాద్రి ఖవ్వాలీ పాడిన వారిని ఘనంగా సన్మానించారు. గురువారం ఆస్థానయే గౌసియాలో ఖురాన్ పఠనం చేసి ప్రత్యేక దువా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పీఠాధిపతి కుమారుడు సయ్యద్‌షా తాహీర్‌పీరా ఖాద్రి, సోదరుడు సయ్యద్‌షా నిజాముద్దీన్‌అవులియా ఖాద్రి, సయ్యద్‌షా ఖుక్తియారుద్దీన్ ఖాద్రి, ఇతర ప్రాంతాల పీఠాధిపతులు పాల్గొన్నారు.

రైలు కిందపడి ఒకరి దుర్మరణం

ముద్దనూరు–కొండాపురం : మండలంలోని మంగపట్నం రైల్వే స్టేషన్ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి రైలు కిందపడి మృతి చెందాడని యర్రగుంట్ల రైల్వే హెడ్ కానిస్టేబుల్ రాజారాం రెడ్డి తెలిపారు. రైలు కింద పడిన వ్యక్తి టీ షర్టు, ధరించి వున్నాడని తెలిపారు. కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

పచ్చిరొట్టతో.. పైరుకు బలం

- జీలుగ, జనుము, పిల్లపెసర సాగుతో భూసారం మెండు
- జిల్లాకు 5323 క్వింటాళ్ల పచ్చి రొట్ట విత్తనాలు
- గ్రామాల్లోని ఆర్‌బీకేల ద్వారా పంపిణీకి సిద్ధం

పచ్చి రొట్ట.. పంట దిగుబడిలో ప్రధాన భూమిక పోషిస్తుంది. భూసారం పెంపులో దిట్ట. భూముల్లో రేగడి మట్టి పోసేకంటే.. నేల స్వభావానికి అనుగుణంగా పచ్చిరొట్ట ఎరువు సాయంతో సారవంతంగా మార్చుకోవచ్చని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. పచ్చి రొట్ట ఎరువుకోసం జీలుగ, పిల్లపెసర, జనుము మొక్కలను పొలంలో కలియదున్నడంతో అవి కుళ్లి మొక్కలకు సారవంతమైన భూమిని అందిస్తుంది.



జనుముపంట



జీలుగపంట



పెసరపంట

కడప అగ్రికల్చర్ : నైరుతి రుతు పవనాలు మరో వారం పది రోజుల్లో రాయలసీమను తాకనున్నాయి. ఉపరితల ద్రోణి ఆవర్తనంతో ఇప్పటికే జిల్లాలో వర్షాలు కురుస్తున్నాయి. నేలలో అదును ఏర్పడితే జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో 75189 హెక్టార్లలో పంటల సాగు చేస్తారని అంచనా. కేసీ కాల్వ, కుందూ, పెన్నా నదుల పరివాహక ప్రాంతాల కింద 31,171 హెక్టార్లలో వరిపంట సాగుకానుందని అధికారులు నివేదిక తయారు చేశారు. ఈ సమయంలో రైతన్నలు పచ్చిరొట్ట ఎరువులైన జనుము, జీలుగ, పిల్లిపెసర పూత దశ రాక మునుపే భూమిలో కలియదున్నితే నిర్జీవమైన పుడమి వడి తిరిగి జీవం పోసుకుంటుందని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు.

రాయితీపై పచ్చిరొట్ట విత్తనం

రైతులకు అవసరమైన పచ్చిరొట్ట విత్తనాలైన జీలుగ, జనుము, పిల్ల పెసర విత్తనాన్ని రాయితీపై అందించనుంది. జిల్లాకు 5323 క్వింటాళ్లు కేటాయించారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా రిజిస్ట్రేషన్ పక్రియ చేసుకున్న వారికి రాయితీపై విత్తనం ఇవ్వనున్నారు. ప్రస్తుతం రసాయన ఎరువుల వాడకంతో భూమికి పోషకాలు లభించడం లేదు. ఇపుడు వాతావరణ అనుకూలతను బట్టి పచ్చిరొట్ట విత్తనం సాగు చేస్తే.. 45 రోజుల వ్యవధిలో పూత దశకు చేరుకుంటుంది. వరి నాట్లకు ముందు పంటను కలియదున్నితే కావాల్సిన పోషకాలు అందుతాయని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు.

ప్రయోజనాలు మెండు..

నేలతల్లి ఒడిలో విత్తు ఆరోగ్యంగా ఎదిగి ఫలసాయం రావాలంటే భూమిలో సారం పెంచే పచ్చిరొట్ట ఎరువులు కీలక ప్రాత పోషిస్తాయి. జీలుగ, జనుము, పిల్ల పెసర సాగు చేసిన రైతులు 40 నుంచి 50 రోజుల తర్వాత దున్నుకోవాలి. భూమికి తగినంత సేంద్రియ పదార్థం అందుతుంది. లెగ్యూమ్ జాతి పచ్చిరొట్ట గాలిలోని నత్రజనిని బుడిపెల రూపంలో సేకరించి పొలంలో కలియ దున్నడంతో భూసారం పెరుగుతుంది. నేలలో తమను నిలుపుకొనే శక్తి, గాలి ప్రసరణ, నీరు ఇంకే గుణం పెంపొందుతుంది. రొట్ట కుళ్లినప్పుడు విడుదలయ్యే అమ్లాల ద్వారా నేల క్షారత తగ్గుతుంది. భాస్వరం ఎక్కువగా మొక్కలకు అందుబాటులోకి వస్తుంది. సూక్ష్మ ధాతువులైన ఇనుము, జింకు, మాంగనీస్ లోపాలు, అధిక ఉష్ణోగ్రత నియంత్రిచవచ్చు. చేసుకు చేవతోపాటు అన్నదాత అధిక లాభాలు పొందవచ్చు. కృత్రిమంగా వాడుతున్న నత్రజని వినియోగం తగ్గుతుంది.

జిల్లాకు మంజూరైన రాయితీ విత్తనాల వివరాలిలా...

విత్తనాలు	మంజూరైనవి (క్వింటాళ్లు)	సబ్సిడీ
జీలుగలు	4780	50 శాతం
జనుములు	463	50 శాతం
పిల్లపెసలు	80	50 శాతం

ఏ ఏ విత్తనం ఎంత లాభమంటే..

జీలుగ : ఎకరా జీలుగ సాగుకు 12 నుంచి 16 కిలోల విత్తనం అవసరం. ఈ పైరు ద్వారా 6 నుంచి 8 టన్నుల పచ్చి రొట్ట వస్తుంది. దీనిని పొలంలో దున్నడంతో నత్రజని- 30, భాస్వరం-8, పొటాషియం -25 కిలోలు పొందవచ్చు. మాగాణి భూముల్లో సాగు చేసుకుంటే మంచిది.

జనుము : ఎకరా జనుము సాగుకు 20 కిలోల విత్తనం కావాలి. పచ్చి రొట్ట 4 నుంచి 6 టన్నులు వస్తుంది. నత్రజని-40, బాస్వరం-6, పొటాషియం 20 కిలోలు వస్తుంది. పూత రాక మునుపే భూమిలో కలియదున్నాలి.

పిల్లపెసర : ఎకరా పిల్లిపెసర సాగుకు 6 నుంచి 8 కిలోల చల్లుకోవాలి. పంట కోత దశలో దుక్కులు చేసుకుంటే 2 నుంచి 3 టన్నుల పచ్చిరొట్ట వస్తుంది. దీని ద్వారా నత్రజని 18, భాస్వరం 2.5, పొటాషియం -13 కిలోలు వస్తుంది.

ఆర్‌బీకే ద్వారా విత్తనాలు...



పచ్చిరొట్ట విత్తనాలను రైతు భరోసా కేంద్రాల ద్వారా 50 శాతం రాయితీతో రైతులకు అందిస్తున్నాం. ప్రస్తుతం జిల్లాలోని ఆర్బీకేలలో రిజిస్ట్రేషన్ పక్రియ సాగుతుంది. పచ్చిరొట్ట విత్తనా/ కావాల్సిన ప్రతి రైతు తమ సమీపంలోని కేంద్రాలకు వెళ్లి తమ పేర్లు నమోదు చేసుకోవాలి. ప్రభుత్వం రాయితీపై అందించే విత్తనాలను సకాలంలో పొందవచ్చు.

– అయితా నాగేశ్వరావు, జిల్లా వ్యవసాయ అధికారి

చైన్ స్నాచర్ అరెస్ట్



అరెస్టు వివరాలు తెలియజేస్తున్న కడప చిన్నచౌక్ సీఐ నరసింహారెడ్డి

కడప అర్బన్ : కడప చిన్న చౌక్ పోలీస్ స్టేషన్ పరిధిలో ముత్తరాసపల్లి ప్రాంతంలో ఓ మహిళ మెడలో బంగారు సరుడు లాక్కెళ్లిన చైన్ స్నాచర్‌ను దేవుని కడప ఆర్చీ వద్ద చిన్నచౌక్ సీఐ పి.నరసింహారెడ్డి, ఎస్ఐలు మహమ్మద్‌రఫీ, పి.రవికుమార్ సిబ్బందితో వెళ్లి అరెస్ట్ చేశారు. పోలీసుల వివరాల మేరకు.. కడప నగర శివార్లలో రాజీవ్ గృహ కల్ప సమీపంలోని లక్ష్మీ నగర్‌లో నివాసముంటున్న నల్లపు అంజి దురలవాట్లకు బానిసగా మారి సులభంగా డబ్బు సంపాదించాలని ఈ చర్యకు పాల్పడ్డారన్నారు. డీఎస్పీ షరీఫ్ ఆదేశాలతో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటుచేసి నిందితుడిని పట్టుకున్నామన్నారు. అరెస్టు చేసేందుకు కృషి చేసిన చిన్నచౌక్ సీఐ, ఎస్ఐ, హెడ్‌కానిస్టేబుళ్లు పీరూసాహెబ్, సి.శివకుమార్, కానిస్టేబుళ్లు పి.వి.శ్రీనివాసులు, పి.ఖాదర్‌హుసేన్, మహేష్, సిబ్బందిని కడప డీఎస్పీ ఎం.డి.షరీఫ్ ప్రశంసించి రివార్డుల కోసం సిఫారసు చేశారు.

దుకాణాల్లో విజిలెన్స్ దాడులు



ఫుడ్ ప్రొడక్ట్స్ తయారీ కేంద్రాల్లో తనిఖీలు చేస్తున్న విజిలెన్స్ అధికారులు

కడప అర్బన్ : కడప రీజనల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు, లీగల్ మెట్రాలజీ ఇన్స్‌పెక్టర్, పబ్లిక్ హెల్త్ శానిటరీ ఇన్స్‌పెక్టర్‌తో కలిసి కడప పరిధిలోని 'విమ ఫుడ్ ప్రొడక్ట్స్, ఎస్.కె.ఎంటర్ ప్రైజెస్'లో తనిఖీలు నిర్వహించారు. అవసరమైన డిక్లరేషన్, తయారీ తేదీ లేకపోవడం, అపరిశుభ్ర పరిసరాలు వుండడంతో కేసులు నమోదు చేసి రూ.60 వేల జరిమానా విధించారు. ఈ తనిఖీలలో ఇన్స్‌పెక్టర్ టి.రెడ్డెప్ప, ఎఫ్ఆర్ఓ జె.మురళీకృష్ణ, అగ్రికల్చరల్ ఆఫీసర్ ఈ.బాలగంగాధర్ రెడ్డి, లీగల్ మెట్రాలజీ ఇన్స్‌పెక్టర్ రమేష్‌రెడ్డి, కడప కార్పొరేషన్ శానిటరీ ఇన్స్‌పెక్టర్ సునీల్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

కువైట్‌లో కామసముద్రం వాసి మృతి



అయ్యవారయ్య(ఫైల్)

అట్లూరు : కామసముద్రం గ్రామానికి చెందిన ఈటే అయ్యవారయ్య(38) కువైట్‌లో గురువారం మృతి చెందారు. బతుకుదెరువు కోసం కువైట్ దేశానికి వెళ్లి ఆయన అక్కడ గృహ నిర్మాణ పనులు చేస్తున్నారు. గురువారం ఉదయం గుండెపోటుకు గురై మృత్యువాత పడినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడికి భార్య లక్షుమ్మ, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

పాము కాటుతో రైతు...

పెద్దముడియం : మండలంలోని పెద్దపసుపుల గ్రామంలో ఎంబీ.ఈశ్వరరెడ్డి పాము కాటుకు గురై గురువారం మృతి చెందారు. గ్రామస్తులు, కుటుంబ సభ్యుల కథనం మేరకు.. ఎంబీ.ఈశ్వరరెడ్డికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉండగా, వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. గత శనివారం పొలంలో పూల చెట్లకు నీరు పెట్టేందుకు వెళ్లగా పాము కాటు వేసింది. కుటుంబ సభ్యులు కర్నూలు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

చింతకొమ్మదిన్నె : మండలంలోని కొప్పర్తి చెరువులో గుర్తు తెలియని మృతదేహం లభ్యమైనట్లు సికేదిన్నె సీఐ శివశంకర్ నాయక్ తెలిపారు. పశువులను మేపేందుకు కాపరులు చెరువు వైపు వెళ్లగా అక్కడ మృతదేహం కనిపించడంతో సమాచారం ఇవచ్చారన్నారు. చనిపోయిన వ్యక్తి వయస్సు దాదాపు 45–50 సంవత్సరాల మధ్య ఉంటుందన్నారు. మృతుడి చేతికి కడియం, నల్లటి డ్రాయర్ ధరించి ఉన్నాడన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్ ఆసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన వివరించారు.

అంబులెన్స్ డ్రైవర్లకు శిక్షణ



అంబులెన్స్ డ్రైవర్లకు శిక్షణ ఇస్తున్న వైద్యులు

కడప అర్బన్ : కడప ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి(రిమ్స్)లోని అనస్తీషియా విభాగం హెచ్ఓడీ డాక్టర్ సునీల్ చిరుక్లా ఆధ్వర్యంలో అంబులెన్స్ డ్రైవర్లకు గురువారం సీపీఆర్(కార్డియో పల్మనరీ అరెస్ట్)పై శిక్షణ ఇచ్చారు. అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ బివి సుబ్రహ్మణ్యం, డాక్టర్ శేషం సోను, పీజీ డాక్టర్ రిజ్వాన్ వారికి సూచనలు చేశారు. కార్డియో పల్మనరీ అరెస్ట్ బాధితుల ప్రాణాలు కాపాడేందుకు తమ శాయశక్తులా ప్రయత్నిస్తామని వారిచే ప్రతిజ్ఞ చేయించారు. శిక్షణలోని అంశాలను మరింతమందికి తెలియజేస్తామన్నారు.

శివమెత్తిన మాస్టార్

- అంతర్జాతీయ అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక
- జాతీయ స్థాయి పోటీల్లో పతకాల పంట
- 45 ప్లస్ వయో విభాగంలో మూడు స్వర్ణపతకాలు

విద్యార్థులకు క్రీడల్లో తర్ఫీదునిస్తూనే.. తానూ సాధన చేశాడు.. వైఎస్ఆర్ కడపజిల్లా పెండ్లిమర్రి మండలం గంగనపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్ ఫిజికల్ డైరెక్టర్ బొగ్గేటి శివశంకర్‌రెడ్డి. ఈ నెల 22, 23వ తేదీల్లో హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలో నిర్వహించిన పాన్ ఇండియా 1వ ఫెడరేషన్ కప్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్–2024పోటీల్లో సత్తా చాటాడు. మూడు స్వర్ణ పతకాలు సాధించి ఇటీవల జరిగిన అంతర్జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికయ్యాడు.

కడప స్పోర్ట్స్ : కమలాపురం మండలం పందిళ్లపల్లి గ్రామానికి చెందిన (ప్రస్తుతం కడప నగరం మారుతీ నగర్‌లో నివాసం) బొగ్గేటి శివశంకర్‌రెడ్డి స్వతహాగా అథ్లెటిక్స్ క్రీడాకారుడు. ఈయన జిల్లాలోని పలు పాఠశాలల్లో ఫిజికల్ డైరెక్టర్‌గా పని చేసి ఎందరో క్రీడాకారులను జాతీయస్థాయి విజేతలుగా తీర్చిదిద్దాడు. ప్రస్తుతం పెండ్లిమర్రి మండలం గంగనపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఫిజికల్ డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఓవైపు విద్యార్థులకు క్రీడల్లో ఉత్తమ శిక్షణ ఇస్తూ.. తాను సైతం వారికి స్ఫూర్తినిచ్చేలా క్రీడా సాధన చేస్తున్నారు. విద్యార్థులతో పోటీపడుతూ ఆయన చేసిన కఠోర సాధన ఊరికేపోలేదు. 2022లో గుంటూరులో నిర్వహించిన రాష్ట్ర స్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీల్లో పతకాల పంట పండించి స్టేట్ చాంపియన్‌గా నిలిచేలా చేసింది. తాజాగా హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో ఈ నెల 22, 23వ తేదీల్లో నిర్వహించిన 1వ ఫెడరేషన్ కప్ నేషనల్ అథ్లెటిక్స్ చాంపిన్‌షిప్‌లో పాల్గొని పతకాల పంట పండించాడు. 45 ప్లస్ వయో గ్రూపులో పాల్గొన్న ఈయన హైజంప్, లాంగ్‌జంప్, ట్రిపుల్ జంప్‌లో ప్రథమ స్థానంలో నిలిచి సత్తా చాటాడు. దీంతో ఈ ఏడాది ఆస్ట్రేలియాలో నిర్వహించనున్న అంతర్జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఈయనను ఎంపిక చేశారు. విజేతగా నిలిచిన బి. శివశంకర్‌రెడ్డికి టోర్నమెంట్ నిర్వాహకులు మెడల్స్, మెరిట్ సర్టిఫికెట్స్ అందజేసి అభినందించారు. పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ జాతీయస్థాయి పోటీల్లో సత్తాచాటి పతకాల పంట పండించి, అంతర్జాతీయస్థాయి పోటీలకు ఎంపికవడంతో ప్రధానోపాధ్యాయురాలు సి.సావిత్రీదేవి, తోటి ఉపాధ్యాయులు అభినందించారు.



అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొన్న బి. శివశంకర్‌రెడ్డి

అగస్త్యేశ్వరా.. నమో నమో

ప్రొద్దుటూరులో వైభవంగా రథోత్సవం



గంగారాజరాజేశ్వరీ సమేత అగస్త్యేశ్వరుడు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో గంగారాజరాజేశ్వరీ సమేత అగస్త్యేశ్వరస్వామిల రథోత్సవం వైభవంగా జరిగింది. వేకువజామున అగస్త్యమహాముని ప్రతిష్ఠించిన శివలింగానికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, రాజరాజేశ్వరీ అమ్మవారికి కుంకుమార్చన చేసి అలంకరించారు. అనంతరం స్వామి, అమ్మవారి ఉత్సవ మూర్తులను పూలతో అలంకరించిన రథంపై కొలువుదీర్చారు. నమో నమో అగస్త్యేశ్వరా.. హరహర మహాదేవ అంటూ భక్తులు జయ ధ్వనుల మధ్య రథం ముందుకు సాగింది. దారి వెంబడి చెక్క భజన, మహిళల కోలాటం, మంగళ వాయిద్యాల మధ్య స్వామి రథోత్సవం ఘనంగా జరిగింది. ఆలయం నుంచి ప్రారంభమైన ఈ రథోత్సవం వెదుర్ల బజార్, గంగమ్మ కట్టవీధి, కొవ్వూరు గ్యారేజ్ మీదుగా మధ్యాహ్నం అమ్మవారిశాల వద్దకు చేరుకుంది. తిరిగి సాయంత్రం ప్రారంభమై మెయిన్ బజార్, పప్పుల బజార్, లైటుపాళెం మీదుగా ఆలయానికి చేరుకుంది. దారి వెంబడి భక్తులు కొబ్బరి కాయలు కొట్టి కర్పూర హారతులు ఇచ్చి భక్తి శ్రద్ధలతో పూజించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి, దేవాదాయశాఖ ఏసీ శంకరబాలాజి, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు నిర్వహించారు.



రథం లాగుతున్న భక్తజనం



మహిళల కోలాటం

పుష్పగిరిలో ఘనంగా గ్రామోత్సవం



పుష్పగిరిలో కామాక్షీ వైద్య నాథ స్వామి, లక్ష్మీ చెన్నకేశవ స్వామిలకు గ్రామోత్సవం

వల్లూరు : పవిత్ర పుణ్యక్షేత్రమైన పుష్పగిరిలో పౌర్ణమి గ్రామోత్సవం గురువారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఉదయం కామాక్షీ వైద్యనాథ స్వామి, లక్ష్మీ చెన్నకేశవ స్వాములకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి స్వాములను వేర్వేరు పల్లకిపై ఆశీనులను చేసి పూజలు నిర్వహించారు. అనంతరం పల్లకీపై పుష్పగిరి మాడ వీధుల్లో గ్రామోత్సవం జరిపారు.

గరుడ వాహనంపై చెన్నకేశవుడు

రాజుపాళెం : మండలంలోని వెల్లాలలో ఐదో రోజున గురువారం రాత్రి గరుడ వాహనంపై శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవస్వామి విగ్రహాలను వైభవంగా ఊరేగించారు. ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించిన పల్లకిలో ఆశీనులను చేసి అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామంలో ఊరేగించారు. చైర్మన్ జగదీశ్వరరెడ్డి, ఈఓ నరసయ్య, భక్తులు దర్శించుకుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ఆవరణంలో తాడిపత్రి వందన కూచిపూడి అకాడమి చిన్నారులు చేసిన భరత నాట్యం అందరినీ ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో గోపాయపల్లె సర్పంచ్ గోవర్ధన్‌రెడ్డి, ఆలయ మాజీ చైర్మన్ జనార్ధన్ రెడ్డి, నల్లదిమ్ము జంగం రెడ్డి, భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.



గరుడ సేవ కార్యక్రమంలో చైర్మన్, భక్తులు

విద్యార్థులకు ఉపకార వేతనాలు

కడప కల్చరల్ : ప్రతిభ కనబరిచిన పేద రెడ్డి సామాజిక వర్గానికి చెందిన విద్యార్థులకు ఉపకార వేతనాలు అందజేస్తున్నట్లు కడప రెడ్డి సేవా సమితి సంస్థ ప్రధాన కార్యదర్శి లెక్కల కొండారెడ్డి తెలిపారు. 2024–25 విద్యా సంవత్సరానికి ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న విద్యార్థులకు ఈ అవకాశం కల్పిస్తున్నామన్నారు. జులై 31వ తేదీ లోగా దరఖాస్తులు పూర్తి చేసి తమ కార్యాలయంలో అందజేయాలన్నారు. నీట్ ర్యాంకు పొంది ప్రభుత్వ వైద్య కళాశాలలో ప్రవేశం పొందిన వారికి ఏటా రూ.25వేలు అందజేస్తామన్నారు. పదివేల లోపు ర్యాంకు సాధించిన బీటెక్ విద్యార్థులకు రూ.20వేలు, కంప్యూటర్ సైన్స్ విద్యార్థులకు ఏటా రూ.10 వేలు, ఇతరులకు రూ. 5 వేలు సాయం అందజేస్తామన్నారు. ఎంసెట్‌లో ర్యాంకు పొంది, ప్రభుత్వ కళాశాలలో చదివే అగ్రికల్చర్, వెటర్నరీ బీఎస్సీలు చదివే విద్యార్థులకు రూ.20వేలు ఇస్తామన్నారు. విద్యార్థుల ఆర్థిక స్థోమతపై విచారించి కమిటీ సిఫార్సు చేసిన వారికే ఉపకార వేతనాలు అందుతాయన్నారు.